నమస్తే తెలంగాణ
మెదక్
15 | హైదరాబాద్, మంగళవారం 26 మార్చి 2024 | MEDAK


ఇటీవల మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో వడగండ్లకు నేలకొరిగిన మొక్కజొన్న పంట

రైతులకు భరోసా ఏదీ?

వడగండ్లతో అపార నష్టం.. ఉమ్మడి మెదక్ జిల్లాలో 6,286 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- రైతాంగాన్ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- నీళ్లు లేక ఎండుతున్న పంటలు
- వచ్చిపోయే కరెంట్‌తో కాలిపోతున్న మోటర్లు
- అందని రైతుల రుణమాఫీ, రైతుబంధు సాయం
- అప్పుకట్టాలని రైతులకు నోటీసులు జారీ చేస్తున్న బ్యాంకు అధికారులు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపులేదని రైతుల ఆగ్రహం

సిద్దిపేట, మార్చి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతులకు భరోసా ఏదీ..? వడగండ్ల వర్షం, ఈదురుగాలులతో పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో వందలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినా ఇంతవరకు ప్రభుత్వం నుంచి స్పందన లేదు. రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. పంట నష్టం జరిగినా జిల్లా మంత్రులు పంటలను సందర్శించలేదు. రైతులను ఓదార్చలేదు. జిల్లా మంత్రులు రైతుల సమస్యలపై దృష్టి సారించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన అన్నదాతను అతలాకుతలం చేసింది. పంటలు చేతికి రానున్న సమయంలో కురిసిన వడగండ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చింది. వరి, మొక్కజొన్న, జొన్న పంటలతోపాటు ఇతర పంటలు దెబ్బతినడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతంలో అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోతే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా వెళ్లి రైతులను పరామర్శించి రైతులకు భరోసా కల్పించారు. అక్కడికక్కడే ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం ప్రకటించి అమలు చేశారు. ఈ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు. రాజకీయాలు తప్ప, రైతు ప్రయోజనాలు పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని అన్నదాతకు అండగా నిలవాలని రైతులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 6,286 ఎకరాల్లో పంట నష్టం

సిద్దిపేట జిల్లాలో 1,794 మంది రైతులకు చెందిన 2,806 ఎకరాలు, మెదక్ జిల్లాలో 2,154 మందికి చెందిన 2,766 ఎకరాలు, సంగారెడ్డి జిల్లాలో 343 మంది రైతులకు చెందిన 714 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 4,191 మంది రైతులకు చెందిన 6,286 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో వడగండ్లతో ఇంత నష్టం జరిగినా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. రైతులకు పంట నష్టం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. మరో పక్క బ్యాంకు రుణాలు చెల్లించాలని రైతులకు బ్యాంకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేదు. జిల్లాకు చెందిన మంత్రులు కనీసం రైతుల గురించి పట్టించుకోవడం లేదు. యాసంగి సాగు ఆరంభం నుంచి రైతులకు కష్టాలు వెంటాడుతూనే ఉంటున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో సాగుకు ముందే పెట్టుబడి సాయం కింద రైతుబంధును అందించి రైతులను ఆదుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పూర్తిస్థాయిలో రైతుబంధు సాయం ఇవ్వలేదు. దీంతో రైతులు అప్పులు తెచ్చి పంటలను సాగు చేశారు. పంట చివరి దశలో సాగునీరు అందక, కరెంట్ కష్టాలతో పంటలు ఎండిపోతున్నాయి. కొన్నిచోట్ల పశువుల మేపుతున్నారు. ఎండిపోగా మిగిలింది చేతికి వస్తుందనుకుంటే వడగండ్ల రూపంలో పంటలకు నష్టం జరిగిందని రైతులు బోరున విలపిస్తున్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకొని పంట పెట్టుబడి సాయంతో పాటు నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.


ఇటీవల రామాయంపేటలో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

హామీలు ఏమయ్యాయి..?

రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఏది..? రైతుబంధు ఏది..? రైతులకు పంట బోనస్ ఏది..? అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఎమయ్యాయి..? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా ఇంతవరకు రైతుబంధు పూర్తిగా వేయలేదు. కేవలం మూడు ఎకరాల వరకు మాత్రమే రైతులకు రైతుబంధు సాయం వేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకున్నది. రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారు. యాసంగి పంట చేతికి వచ్చే సమయానికి సైతం రైతుబంధు రాలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో రైతుబంధు వేయడంతో రైతులు హాయిగా సాగు చేసుకున్నారు. పెట్టుబడి సాయం సకాలంలో రావడంతో రైతులు వడ్డీ వ్యాపారుల వద్దకెళ్లే అవసరం లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ రైతులు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్తున్నారు. రైతులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. మరో పది రోజులు అయితే పంట చేతికొస్తుంది. ఈ సమయంలో రైతులకు పంట బోనస్ ప్రకటించాల్సిన ప్రభుత్వం ఆ ఊసే లేకుండా నెట్టుకొస్తుంది.

కాలిపోతున్న మోటర్లు..

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో వచ్చిపోయే కరెంట్‌తో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతాంగానికి నాణ్యమైన 24 గంటల కరెంట్‌ను అందింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాణ్యమైన కరెంట్ రావడం లేదు. వచ్చిపోయే కరెంట్‌తో బోరుబావుల మోటర్లు కాలిపోతున్నాయి. బోరు నుంచి మోటరును పైకితీసి రిపేరు చేయించి మళ్లీ బోర్‌లో దించడానికి ఎంత లేదన్నా సుమారుగా రూ.10 వేల వరకు ఖర్చు అవుతున్నది. ఒక్కో రైతు మోటరు వారంలో రెండుసార్లు కాలిన సందర్భాలూ ఉన్నాయి. దీంతో ఖర్చులు తడిసిమోపెడై రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చూసినా కాలిపోయిన మోటర్లు కనిపిస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో మోటరు మెకానిక్‌లకు పనిలేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే కరెంట్ మోటరు మెకానిక్‌లకు చేతినిండా పని దొరుకుతున్నది. ఎంత లేదన్నా సగటున రోజుకు 8 నుంచి 10 మోటర్లు రైతుల నుంచి రిపేరుకు వస్తున్నాయని మెకానిక్‌లు తెలుపుతున్నారు. ఎండిన మడులను పారించడానికి రైతులు కష్టాలు పడాల్సి వస్తుంది. వరికి పొట్ట దశలో ఎంత నీరు అందిస్తే అంత మంచిగా పంట వస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని పంటను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పంటలను రక్షించుకోవడానికి బోర్లు వేస్తున్నారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల తదితర ప్రాంతాల్లో ఎక్కడచూసినా బోరుబండ్లు కనిపిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం బోరుబండ్లు, క్రేన్ల యజమానులు బిజీఅయ్యారు. రైతులు పెట్టుబడులు పెట్టి ఇంతచేసినా పంట చేతికి వస్తుందా..? అని ఆందోళన చెందుతున్నారు. ఇంకోవైపు ఎండిన పంటల్లో పశువులను మేపుతున్నారు. చాలా గ్రామాల్లో పంట ఎండిపోవడంతో రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు.

సిద్దిపేట జిల్లా నంగునూరులో మోటరు రిపేరు చేస్తున్న మెకానిక్

రేగోడ్‌లో రుణాలు చెల్లించాలని రైతులను అడుగుతున్న బ్యాంకు అధికారులు

కాంగ్రెస్ సర్కార్‌లో రైతులకు ఎదురుదెబ్బ

రైతులకు బ్యాంకు అధికారుల వేధింపులు

- రుణాలు చెల్లించకపోతే ఊరుకోమన్న బ్యాంకు అధికారులు
- పంటలు పండిన తర్వాత చెల్లిస్తామన్న రైతులు
- మెదక్ జిల్లా రేగోడ్ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి...

మెదక్, మార్చి 25 (నమస్తే తెలంగాణ)/ రేగోడ్ : కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వస్తే కష్టాలు తొలుగుతాయని, జీవితాలు బాగుపడుతాయని అనుకున్న రైతులకు ఎదురుదెబ్బ తగులుతోంది. కేసీఆర్ ప్రభుత్వంలో బ్యాంకు అధికారులు రైతులను వేధించిన సందర్భాలు ఎక్కడా లేవు. కానీ కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాగానే రైతులను నానాతిప్పలు పెడుతున్నది. అంతేకాదు బ్యాంకులో తీసుకున్న రుణాలకు రైతులకు నోటీసులు ఇచ్చి బలవంతంగా వసూళ్లు చేస్తున్నది. తాజాగా మెదక్ జిల్లా రేగోడ్ మండలంలోని కొత్వాల్‌పల్లిలో మూడు రోజుల క్రితం రేగోడ్ ఏపీజీవీబీ అధికారులు గ్రామానికెళ్లి బ్యాంక్‌లో తీసుకున్న రుణాలు చెల్లించాలని దౌర్జన్యం చేసి, నోటీసులు ఇచ్చారు. బ్యాంక్ బకాయిలు కట్టాలి అనే ఫ్లకార్డులు పట్టుకొని రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు రైతులతో మాట్లాడుతూ వడ్డీ చెల్లిస్తే ఇక్కడి నుంచి వెళ్తామని తెలుపగా, రైతులు ఒక్క పైసా కూడా కట్టమని, మీ ఇష్టం ఉన్నట్టు చేసుకోవాలని కరాఖండిగా చెప్పారు. రుణమాఫీ డబ్బులు వచ్చేంత వరకు రుణాలు చెల్లించమని రైతులు సమాధానమిచ్చారు.

రుణమాఫీ మాకు సంబంధం లేదు: బ్యాంకు అధికారులు

కాంగ్రెస్ సర్కార్ వస్తే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. బ్యాంకులో తీసుకున్న రుణం చెల్లించవద్దని ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు మీరొచ్చి రుణాలు చెల్లించాలని డిమాండ్ చేస్తే ఎలా అని రైతులు బ్యాంకు అధికారులను నిలదీశారు. రుణమాఫీతో మాకు సంబంధం లేదు. ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తే అవి మీకు ఇస్తాం అంతేకానీ.. తీసుకున్న రుణాలు కట్టాల్సిందేనని బ్యాంకు అధికారులు రైతులతో వాగ్వాదానికి దిగారు.

పంటలు పండిన తర్వాత కడుతాం..

పంటలు పండిన తర్వాత అప్పులు చెల్లిస్తామని కొత్వాల్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు బ్యాంకు అధికారులకు తెలిపారు. మీరు వచ్చి దౌర్జన్యంగా డబ్బులు కట్టాలని డిమాండ్ చేస్తే చెల్లించమని రైతులు తేల్చిచెప్పారు. మీ అప్పు కోసం మేము ఏమన్న తాగి చావాలా అని వాపోతున్నారు. కాంగ్రెస్ సర్కార్ వస్తే రైతులకు ఇన్ని ఇబ్బందులు వస్తాయని అనుకోలేదని రైతులు అంటున్నారు. రూ.50వేలు తీసుకుంటే రూ.2 లక్షలు ఎలా అవుతాయని రైతులు బ్యాంకు అధికారులను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేసే వరకు ఒక్క పైసా కూడా చెల్లించేది లేదని రైతులు బ్యాంకు అధికారులకు తెలిపారు.

మూడుసార్లు నోటీసులిచ్చారు..

పంటరుణం కట్టుమని మూడుసార్లు నోటీసులిచ్చారు. రుణం చెల్లించకపోతే కేసులు పెట్టి వసూలు చేస్తామని బ్యాంకు సిబ్బంది బెదిరించారు. పంట నష్టం జరిగి, గిట్టుబాటు ధరలేక మేము ఇబ్బంది పడుతుంటే రుణం కట్టమని నోటీసులిచ్చి వేధింపులకు గురిచేయడం సరి కాదు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పింది. అవి వచ్చేవరకు ఆగమని చెప్పినా అధికారులు వినిపించుకోవడం లేదు. – విజయ్, రైతు, కొత్వాల్‌పల్లి

మనోవేదనకు గురిచేస్తున్నారు..

బ్యాంకు అధికారుల వేధింపులు భరించలేకపోతున్నాం. పదేండ్ల నుంచి ఎన్నడూ లేనివిధంగా నోటీసులు కాకుండా ఇంటికొచ్చి రుణం చెల్లించాలని మనోవేదనకు గురిచేస్తున్నారు. వర్షాలకు పంట నష్టపోయి, ధరలేక ఎంతో కొంతకు అమ్ముకొని ఇబ్బంది పడుతున్నాం. రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పినా వినకుండా నోటీసులు ఇవ్వడం, ఇంటికొచ్చి బెదిరించడం మంచి పద్ధతి కాదు. – భాస్కర్ రాజు, రైతు, కొత్వాల్‌పల్లి


మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని కలిసిన బీఆర్ఎస్ జగదేవ్‌పూర్ మండల నాయకులు

మెదక్ ఎంపీ అభ్యర్థిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

జగదేవ్‌పూర్ మార్చి 25: మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఆదివారం బీఆర్ఎస్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నర్సింహారెడ్డి, కొండపోచమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి, పీర్లపల్లి మాజీ సర్పంచ్ యాదవరెడ్డి ఆయనకు పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌ను మండలంలో బలోపేతం చేసి ఎన్నికల్లో ఎంపీ గెలుపునకు కృషి చేస్తామని వారు తెలిపారు.

హామీలు అమలు చేస్తున్నాం


జహీరాబాద్‌లో మాట్లాడుతున్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కోహీర్, మార్చి 25: 'ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం, కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలి' అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 48గంటల్లోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించామన్నారు. ఇప్పటివరకు 33కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని వెల్లడించారు. కొత్తగా వెయ్యి బస్సులను కొనుగోలు చేశామని, మరో రెండు వేల బస్సులను సమకూర్చుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆర్టీసీలో మూడు వేల ఉద్యోగాలు కల్పించడంతో పాటు పీఆర్సీ కల్పించామన్నారు. తల్లిని చంపి బిడ్డను బతికించారని ప్రధాని మోదీ అనడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనన్నారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా అని మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీపై శాపనార్థాలు పెడుతున్నారని, ప్రభుత్వం కూలిపోతుందని చెప్పడం విడ్డూరమన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. కర్ణాటకలోని గానుగపూర్ దైవ దర్శనానికెళ్లి హైదరాబాద్ తిరిగి వస్తున్న సందర్భంగా జహీరాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఘన స్వాగతం పలికి పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, మాజీ ఎంపీ సురేశ్ శెట్కార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దిపేట: సిద్దిపేట పట్టణంలోని లాల్‌కమాన్ వద్ద కాముని దహనం

గజ్వేల్: గజ్వేల్‌లో కాముని దహనం వద్ద పట్టణవాసులు


చేగుంట: హోలీ సంబురాల్లో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

సిద్దిపేట: సిద్దిపేటలో యువతుల సందడి

సిద్దిపేట: శ్రీనగర్‌కాలనీలో హోలీ ఆడుతున్న యువతులు

కలర్‌ఫుల్

- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటిన హోలీ సంబురాలు
- ఉత్సాహంగా పాల్గొన్న యువత
- సందడి చేసిన ప్రజాప్రతినిధులు
- ఊరూరా సంబురంగా హోలీ వేడుకలు
- కేరింతలు కొడుతూ రంగుల్లో మునిగితేలిన చిన్నారులు

వసంతంలో వచ్చే తొలి పండుగ హోలీని సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సంబురంగా జరుపుకొన్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. ఊరూరా కాముని దహనంతో పాటు ఉత్సాహంగా పాల్గొని ఒకరినొకరు రంగులతో శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఎటుచూసినా వీధులన్నీ కలర్‌ఫుల్‌గా మారాయి. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సందడి చేశారు.

– నమస్తే తెలంగాణ, న్యూస్ నెట్‌వర్క్, మార్చి 25

సంగారెడ్డి: పట్టణంలో ఉట్టికొట్టి హోలీని ప్రారంభించిన ఎస్పీ రూపేష్

సంగారెడ్డి: పట్టణంలో చిన్నారుల సందడి

రూ.2.36 లక్షల నగదు పట్టివేత

ములుగు, మార్చి 25: ఎలాంటి ఆధారాలు లేని రూ. 2.36లక్షలను సీజ్ చేసి గ్రీవెన్స్ సెల్‌లో డిపాజిట్ చేసినట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. సోమవారం సిద్దిపేట జిల్లా ములుగు మండలంలోని వంటిమామిడి చెక్‌పోస్టును ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు గానీ, మద్యం గానీ రవాణా చేయకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. విధులు నిర్వహించే సిబ్బంది 24/7 అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు రూ.50వేలకు మించి డబ్బులను వాహనాల్లో తీసుకొని వెళ్లరాదన్నారు. ఎక్కువ డబ్బులు తీసుకొని వెళ్తే వాటికి సంబంధించిన పత్రాలను దగ్గరే ఉంచుకోవాలని, లేనియెడల డబ్బులను సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగిస్తామని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వాహన తనిఖీలకు సహకరించాలని కోరారు.

వంటిమామిడి చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి